
# బట్టతలోపాఖ్యానము




అటెండర్ల అరుపు టైపుమెషిన్ల టకటక ధ్వనితో, స్టాఫు హడావిడితో ఎప్పుడు కురుక్షేత్ర మహా సంగ్రామము జరుగుతున్నట్లు ఉంటుంది. ఈ కార్యకలాపాలన్నటికి అతీతుడు, సర్వ కార్య పరిత్యాగి అయిన రంగారావు ఆ ఆఫీసులో అందరికన్న సీనియర్ గను ఇరవై ఏళ్ళ సర్వీసు ఒకే సీటులో, అదే సీటులో గడిపేసి ఆ సీటులో స్థిరపడిపోయాడు. ఎటువంటి సమస్యలు ఎదురైనా ఎన్ని సమస్యలు ఉన్నా చిటికెలో తీర్చి పారేసి ఉపదేశము చేయగల సమర్థుడు. ఆఫీసు సమస్యల విషయంలో వాలికలాంటివాడు. అటువంటి రంగారావుకి యీ మధ్య పెద్ద సమస్య వచ్చిపడింది.

ఎన్నో సమస్యలని అవలీలగా పరిష్కారము చేయగల రంగారావు తన స్వంత సమస్యకి మాత్రము పరిష్కారము లేకపోతున్నాడు. ఆఫీసుకి వచ్చినా, బజారులో తిరిగినా, యింట్లో నిద్దర పోయినా ఆ సమస్య అతని బుర్రని కొరుక్కు తినేస్తున్నది. ఇన్నాళ్ళు తను గుర్తించలేని సమస్య ఈనాడు వెలుగులోకి వచ్చి, అందరి నోట్లో నాని, ఆఫీసు స్టాఫు నుంచి బజారులో పడింది. పరాభవాలు ఎక్కువైపోయాయి.

"ఏమిటీ రంగారావుగారు మీకు అప్పుడే బట్టతలా! ఏమి వయస్సు ముదిరిపోయింది మీకు. ఏదో ఎందో మాకో వాడండి" ఒకళ్ళు కాదు, ఇద్దరు కాదు ప్రతి ఒక్కరు తెలిసి వాళ్ళు, తెలియనివాళ్ళు తన బట్టతల గురించి అడుగుతూ ఉంటే రంగారావుకి చిరాకు ఎత్తిపోతోంది. యిది చాలదు అన్నట్లు మొన్నకు మొన్న ఆఫీసులో చేరిన సుశీల కూడా 'రంగారావు గారు బట్టతల మీకు అందాన్ని యిచ్చింది' అని వ్యంగ్యముగా అని కిసుక్కున నవ్వితే అగ్గిమీద ఆజ్యం పోసినట్లు అయింది రావు పని. అద్దంలో చూసుకొన్నాడు. నిజమే! తన విదియ చంద్రుని లాంటి బట్టతల స్పష్టంగా కనిపిస్తోంది నెత్తిమీద వెంట్రుకలు వెనక్కి వెనక్కి పోతున్నట్లు కనిపిస్తున్నాయి. ఆలోచించే కొలది సమస్య జటిలమవుతుంది కాని సమాధానము కనబడదు. అందుకే రంగారావు యిక ఆలోచించదలుచుకోలేదు.

ఆ రోజు ఉదయం లేచాడు. తెలుసున్న మందుల షాపులన్నీ తిరిగి, బట్టతల పోవటానికి ఎవరే మందు మంచిది అంటే అది తెచ్చి యింటి నిండా స్టాకు వేసాడు. తర్వాత రోజున లైబ్రరీకి వెళ్ళి అన్ని మ్యాగజైన్లు తిరగవేసి 'బట్టతల నివారణకు మందు' అని వ్రాసిన ఎడ్వర్టైజమెంట్లు కంపెనీల ఎడ్రస్సులు తెచ్చాడు. ఈ ఉద్యమములో మొదటి కార్యక్రమము ఇది. ఆ తర్వాత అన్ని కంపెనీలకు వ్రాసి మందులు తెప్పించాడు. రంగారావు కార్యక్రమము ఇలా ఉంటాయి. ఒకదాని

తర్వాత ఒకటి. చూడండి 'సామరంగా' మూడు నెలలకల్లా నెత్తినిండా జుట్టు, గోదావరి కెరటాల్లాగా వంపులు, సొంపులు తిరిగిపోయి ఉంటుంది.ఎవరైనాయీ మధ్యన వ్యాఖ్యానించినా 'ప్' వాళ్ళకేమీ తెలుసుమనతడాఖా'అనినిట్టూర్చి వాళ్ళమీద జాలి పడుతున్నాడు రంగారావు.

సమయము కావాలనుకొన్న వారికి తొందరగా పరిగెడుతుంది. మూడు నెలలు అయిపోయాయి. మందు సీసాలన్ని ఖాళీ అయ్యాయి. రంగారావుకి బట్టతల మీద వెంట్రుక మచ్చుకైనా మొలవ లేదు. యీ మందుల ప్రగతి ఏమిటయ్యా అంటే విదియ చంద్రుని లాంటి అతని బట్టతల నవమి నాటి చంద్రుడిలా తయారయింది. రంగారావుని బట్టతల గురించి ఎవ్వరూ అడగటము లేదు. రావు కూడా దాని విషయమే మర్చిపోయాడు. ఒక వేళ ఎవరైనా అడిగినా 'ఒరేయ్ బడుద్దాయిలు, బట్టతల విజ్ఞాన వంతులుకి తార్కాణం. పెద్ద పెద్ద నాయకులికి, శాస్త్రజ్ఞులకి అందరికి బట్టతలే. 'నేను దేనికి తక్కువా' అని వాళ్ళకి సరైన సమాధానము చెప్పి బట్టతల మురిపంగా నిమురుకుంటాడు. మనస్సులో మాత్రము'ఎవరిఖర్మకువారేబాధ్యులు' అని కృష్ణ భగవానుని గీతా వాక్యము నెమరువేసుకొంటాడు.

కాలము గడుస్తోంది. గడిచినా అది ఒకలాగ గడవదు. అవక తవకలు, ఎత్తుపల్లాలు, ఆశ నిరాశలు తప్పవు. అవే లేకుంటే యీ ప్రపంచములో కొందరికి ఎప్పుడు సుఖమే ఉంటుంది. మరి కొందరి జీవితము దుర్లభమవుతుంది. అలా కాకుండా రంగారావుకి మళ్ళీ బట్టతల ధ్యాస తీసుకువచ్చింది పక్కింటి బామ్మగారు.

"ఏం నాయనా. ఇంత చిన్న వయస్సులో అప్పుడే బట్టతలా. ఏవైనా మందులు మాకులు వాడావా" యక్ష ప్రశ్న వేసింది బామ్మగారు ఊడిపోతున్న ముసుగిని, జారిపోతున్న కళ్ళజోడుని సద్దుకుంటూ.

"చాలా మందులు వాడాను కాని ఏమి సుఖములేదు బామ్మగారు" వినయంగానే చెప్పాడు రంగారావు.

'అలాగా నాయనా, అయితే నీవు జిల్లేడు మందు వాడావా? అది వాడితే తప్పక జుట్టు వస్తుందే' బామ్మగారి ప్రశ్న రంగారావుని కలవర పెట్టింది. ఆశలు రేకెత్తించింది.

'లేదండి.ఎప్పుడు వాడలేదు'

'అయితే మాయింట్లో పుస్తకములో ఉంది. తయారు చేసుకొని తప్పకవాడు నాయనా! మీ తాతగారు ఆయన బతికున్న రోజుల్లో ఎంత మందికో బట్టతల నయం చేసారు. యీ మందు వాడేవంటే నీ తలంతా ఒత్తుగా, బొద్దుగా జుట్టు వచ్చేస్తుంది. అప్పుడు సినిమా హీరోలా ఉంటావు' పుస్తకము తేవటం కోసము బామ్మగారు వెళ్ళిపోయింది.

రంగారావు ఆ ముసలాయన గురించి, ఆయన వైద్యము గురించి విన్నాడు. బామ్మగార్కి మనస్సులోనే థాంక్సు చెప్పుకున్నాడు. జుట్టువస్తే బామ్మగార్కి మంచి పట్టుచీర కొని యివ్వాలని నిర్ధారణ చేసుకొన్నాడు.

'ఇదిగో నాయనా! యీ పుస్తకంలో ఎక్కడో వ్రాసారు. 'వెతికి చదువూ' అంటూ ముట్టుకుంటే పూడిపోయే, అప్పటికే ఎన్నో పేజీలు చిరిగిపోయి శిథిలావస్థలో ఉన్న పుస్తక రాజాన్ని అందించింది బామ్మగారు.

రంగారావు ఆత్రంగా పేజీలు తిప్పసాగాడు. పేజీలు చిరిగిపోయి ఉన్నా కరక్కాయ సిరాతో వ్రాయటంతో అక్షరాలు స్పష్టంగా ఉన్నాయి. 'యురేకా' రంగారావు సంతోషముతో ఎగిరి గంతేసాడు. తల గుమ్మానికి కొట్టుకొని బొప్పికట్టింది. తనకు కావలసిన మందు దొరికింది. గబగబా చదవ సాగాడు.

"అప్పుడే కోసిన వంద వేప ఆకుల నూరి రసము తీయాలి. ఒక పండు ఉమ్మెత్త కాయ, రెండు జిల్లేడు ఆకులు కలిపి ఉడకపెట్టాలి. నీళ్ళు యింకిపోయాక వేపరసము యీ ముద్ద మెత్తగా నూరాలి. యీ మందు రాత్రి నిద్ర పోయేటప్పుడు తలకు రాసుకొని తెల్లటి గుడ్డ కట్టి పడుకోవాలి. ఇలా ఒకరోజు చేస్తే చాలు. కాని ముఖ్యగమనిక..."

ఆ తర్వాత కాగితము చిరిగిపోయింది. రంగారావు యిక ఏమి ఆలోచించదలచుకోలేదు. చదివిన వెంటనే పుస్తకము అక్కడ పడేసి కావలసిన సరుకులు తేవటానికి వెళ్ళిపోయాడు. ఆవేళ ఆఫీసుకి శెలవుపెట్టి మందు దగ్గరుండి తయారు చేశాడు.

రాత్రి పెందరాళే భోజనము చేసి తయారు చేసిన మందు తలకు దట్టంగా పట్టించాడు తలకు తెల్లటి వస్త్రము చుట్టి మంచముమీద నడుము వాల్చాడు. 'రేపటినుంచి తన రూపే మారిపోతుంది.' మగత నిద్దరలో ఒక తియ్యటి కల. కలలో తను హీరో. తన అందమైన, పొడుగాటి జుట్టును మెచ్చుకుంటూ అందమైన అమ్మాయిలు, తన ఒంక మెచ్చుకోలుగా చూస్తు సుశీల. యిలా కల రంగులు మారిపోతోంది.

ఇంతలో తల దురద మొదలు పెట్టింది. నిద్రకు భంగము కలిగింది. తియ్యటి కల నీరు కారిపోయింది. కండూతిని ఓర్చుకోవడము బ్రహ్మదేవునికే తెలియలేదు అటువంటిది పూర్ రంగారావు ఎంత. తల గబగబా బరక సాగాడు. 'ఆహా' పూర్వీకుల నాటు వైద్యము ఎంత గబాలున పనిచేస్తోంది. అప్పుడే ఫలితము కనిపిస్తోంది. తలంతా సూదులు గుచ్చుతున్నట్లు ఉంది. యిదంతా మందు మహిమే. తలలోంచి అప్పుడే వెంట్రుకలు బయటకు చొచ్చుకు వస్తున్నాయి. సంతోషము ఒక వైపు, తల దురద రెండవవైపు తలంతా గోకి గోకి ఆ దురదా సుఖంతో హాయిగా నిద్రపోయాడు.

ఉదయము లేచేసరికి చాలా ఆలశ్యం అయిపోయింది. లేచిందే తడవుగా నిలువుటద్దము దగ్గరకు పరిగెత్తాడు. తలకు కట్టిన గుడ్డని జాగ్రత్తగా విప్పాడు.

'ఆశ్చర్యము' ఇది కలయా! వైష్ణవ మాయమా! ఎంత మార్పు? ఎంత మార్పు. తన కళ్ళను తనే నమ్మలేకపోతున్నాడు. అద్దంలో ప్రతి బింబము తనదేనా. ఒక రాత్రిలో యింత మార్పా. తను స్వప్నలో ఉన్నాడా లేదా [illegible] గిల్లుకొన్నాడు! కళ్ళు మరీ నలుపుకు చూసాడు. అద్దంలో ఉన్నది తనే. రంగారావ్ కాని రంగారావులా లేడే. తను 'రంగారావు మైనస్ ఆఫ్ జుట్టు' అయితే ప్రతి బింబము రంగారావు మైనస్ ఫుల్ జుట్టులా ఎలా కనిపిస్తున్నది. తన నెత్తిమీద జుట్టుకాస్తా ఏమైంది. తనకు బట్టతల పోయి గుండు ఎలా అయింది. ముందు ఆశ్చర్యం తర్వాత ఆలోచనలోపడాడు రంగారావు. తనను యిన్నాళ్ళు అంటిపెట్టుకొని ఉన్న జుట్టు ఏమైనట్లు. తన నవమినాటి చంద్రుని తల, పూర్ణిమి చంద్రునిలా ఎలా అయింది? రంగారావులో ప్రశ్నపై ప్రశ్న. తను ఎప్పుడు ఆఫీసులో యిలా ఆలోచించలేదే! రంగారావులో బల్బు వెలిగింది. ఇదంతా మందు ప్రభావమన్న మాట. ఏమది! ఎంత హతవిధి. అద్దం ముందే స్వగతము, ఏకపాత్రాభినయనము చేస్తున్నాడు రంగారావు.

'అయిందా సంబరము. నేను ఆ మందులు మాకులు వాడద్దని మొత్తుకుంటే విన్నారా. ఇప్పుడు అనుభవించండి' నవ్వాపుకోలేక దులప వలసింది దులిపి కాఫీ గ్లాసు అక్కడ పెట్టి వెళ్ళిపోయింది రంగారావు ధర్మపత్ని.

రంగారావులో ఏదో వెలుగు. ఏదో సంతృప్తి. గుండు అయితే అయింది. బట్టతల వదిలింది. మురిపెంగా నిమురుకున్నాడు గుండును. తన ఫస్టుకేసులో రోగి చస్తే చచ్చాడు వాడి జ్వరము మాత్రము తగ్గింది అని సంతోషముతో కేరింతలు కొట్టే కుర్రడాక్టరులా.

కాని అసలు విషయము మాత్రము రంగారావుకు పదిరోజుల తర్వాత తెలిసింది. అది కూడా బామ్మగారి నోటి ద్వారా. 'నాయనా! ఆ మందు బట్టతల మీదే రాయాలి. అంతేకాని జుట్టుకు తగలనీయకూడదు ఆ! రెండవ విషయము ఎంత దురద వచ్చినా గోకకూడదు.'

'చాల్లే నిర్వాకము తల్లీ' అని మనస్సులో అనుకొని 'నయం, ఇంకాపట్టుచీర తెచ్చి యింట్లో పెట్టలేదు' తన తెలివికి తనే సంతోషపడ్డాడు రంగారావు.

'అమ్మా! నాన్నకు పూర్తిగా గుండు అయింది కదా యిప్పుడా మందు రాస్తే జుట్టు తలంతా వస్తుందా!' తన కొడుకు తల్లిని అడుగుతున్న ప్రశ్న విననట్లు పేపర్లో తల దూర్చాడు రంగారావు.

ఒంటిలో తల్లీ కొడుకుల నవ్వుల సంగీతం జంటగా వినిపిస్తున్నాయి రంగారావుకు. ★